మైనపు బొమ్మ

"మా అత్తవారు బంగారు వ్యాపారస్థులే... స్టేటస్ కాన్షియన్స్ మనుష్యులు. నా తరఫున నువ్వు వస్తే నాకు గర్వంగా ఉంటుంది..." జడ్జిగారి కోడలు భాగ్యవతిని తన మరదలు పెళ్ళికి రమ్మని ఒట్లు, సత్యాలు వేయించుకుని వెళ్ళింది రాజేశ్వరి.

నవ్వుకున్నది భాగ్యవతి. ఒకరకంగా ఆనందించింది.

కారణం?!

భాగ్యవతి ఒకప్పుడు లోయర్ మిడిల్ క్లాసు ఆడపిల్ల – తెలియకుండానే దరిద్రం అంటే భయం, ఏవగింపు పెంచుకున్నది. మానవత్వం, స్టేటస్ ఒక్కొక్కప్పుడు సమానాంతర రేఖలుగా ఉన్నప్పుడు, రెండోదానికి మొదటిదాన్ని ఆపాదించి కలిపి చూడాలనుకోవడమే కృత్రిమత్వం. దీనికి ప్రలోభమున్నవారు చాలా తేలిగ్గా లొంగిపోతారు

అలా లొంగిపోయిన భాగ్యవతి 'ప్రేమ' అనే భ్రాంతిలో పడింది. రెండేళ్ళతో వివాహం ఇచ్చే నిర్లక్ష్యపు కవచంతో బతికేసే ధనశేఖరాన్ని "నన్నే కావాలని ఎందుకు చేసుకున్నారు?" అని ఉక్రోషంగా అడిగితే...

"ఆ! పోనీ పడుంటావని..." అన్న నిర్లక్ష్యసమాధానికి అలవాటుపడక తప్పలేదు భాగ్యవతికి. పెళ్ళనే ఈ ప్రాసెస్‌లో జడ్జిగారి కోడలు, లీడింగ్ కంప్యూటర్స్ ఓనరు ధనశేఖరం భార్య అయిన ఆమెకు డబ్బు ఇచ్చే మొదటి జబ్బు – మామూలు వాళ్ళలో మనుషుల్ని గుర్తించక పోవడం – అని గ్రహింపు వచ్చింది.

రాజీ పిలుపులో తనను తానుగా గుర్తించిన గురుతులున్నాయని ఆశపడింది.

"పెళ్ళికి వెళ్ళాలా? ముందు చెప్పద్దూ! నా కారు సర్వీస్ కిచ్చానే..." రిటైర్ అయిన మామగారు.

"ఫరవాలేదండీ! ఆటోలో వెళతాను." ఎంత గట్టిగా సమాధానం చెబుదామన్నా ఆయన ఉనికిలోనే ఉన్నది భయపెట్టే గుణం.

"ఆటోలోనా?" ఆ ప్రశ్నలోనే భూనభోంతరాళాలన్నీ కదిలిపోయేటంత గాంభీర్యం. "వెళదామనే?" అన్న చాలెంజ్, "ఒద్దు" అన్న వార్నింగ్...బోలెడు.

సాయంత్రం మామగారు వాకింగ్‌కు వెళ్ళి వచ్చే లోపల ఆటో తెప్పించుకుని ఎక్కి కూర్చుంటూ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ పేరు చెప్పింది గిఫ్ట్ కొనాలని. నిస్సహాయంగా, భయంగా చూశారు వాచ్‌మన్, వంటమనిషి.

లేతరంగు వెంకటగిరి చీర, నల్లపూసలు... హాయిగా, తెరిపిగా ఉన్నది ఆమెకు. ఆడంబరాలు అన్ని చోట్లా తప్పవు... రాజీ దగ్గర కూడానా?

బోలెడు మంది స్నేహితురాళ్ళు వస్తారు.... చాలా రోజుల తరువాత హాయిగా నవ్వుకుంటూ....

"ఏం చేస్తున్నావు?" అని అందరూ అడిగితే....

"ఏం చెయ్యటం లేదు" అని చెప్పాలా?! నవ్వొచ్చింది భాగ్యవతికి.

కాలేజీలో ఎన్ని ఆదర్శాలు? ఎన్ని కబుర్లు.... చాలా రోజుల తరువాత ఆలోచించనివన్నీ ఆలోచిస్తోంది భాగ్యవతి. 'ఎందుకని ఆ పెద్ద మేడలో, ఆ మొనాటనీ మధ్య కనీసం ఎందుకు పనికిరాకుండా పోయానో కూడా ఆలోచించలేకపోతున్నానేమిటి?' అనుకున్నది.

జర్క్‌తో ఆటో ఆగింది.

గిఫ్ట్ కొని బయటకు వస్తూంటే –

"హాయ్ భాగ్యా! ఇదేమిటి ఇక్కడ? మా ఇంట్లో దండలు ఆలస్యమైతే తెమ్మనమని నన్ను పంపారు. చూశావా? ఒక్కొక్కటి ఐదువందలు... ఉన్నవాళ్ళుగా... అంతే మరి. ఇదిగో ఈ చీర, ఈ నెక్లెస్ మా మామగారు కొనిపెట్టారు... అది సరే. కారేదీ?!"

గబగబా మాట్లాడేస్తోంది రాజీ.

"కారూ...." నసుగుతూ అన్నది భాగ్య

"ఆటోలో వచ్చావా? ఏం ఖర్మే?"

"మీ ఇంట్లో పెళ్ళికే బయలుదేరాను....."

ఆ మాటల్లో ఏదో తక్కువైపోయిన ధ్వని ఎందుకు వస్తుందో ఆమెకే అర్థం కాలేదు.

"ఏమిటీ?" కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యపోయింది రాజీ.

"ఈ చీరతో, ఈ ఆటోలో – నువ్వు నా స్నేహితురాలివని గొప్పగా చెప్పుకోవాలని నేను చూస్తూంటే...." ఆ గొంతులో బోలెడంత హర్ట్.

అయోమయంగా చూసింది భాగ్య... "నేను నేనుగా నీకు ఒద్దా?" అన్నట్లు చూసింది.

సఱ్ఱున పడవంత కారు పక్కన ఆగింది.

"అమ్మగారూ! అయ్యగారు కారు పంపారు. ఇంటికి వెళ్ళి వెళుదురు గాని రండి...." వంటమనిషి అన్నాడు.

"అదేకదా! అయినా, నీకు మతి లేదే – ఇంటికి వెళ్ళి దర్జాగా రాక...వస్తాను." కారెక్కి వెళ్ళిపోయింది రాజీ.

ఇంక ఆలోచించడానికి ఏం మిగలలేదు భాగ్యకు. పెద్ద నగలు మామగారి అధీనంలో ఉంటాయి.... పట్టుచీర, రవ్వల నగలు, పడవంత కారు.

"చూడమ్మాయ్... ఎప్పుడూ ఇలా సింపుల్‌గా బయటకు వెళ్ళకు. నువ్వు నువ్వుగా ఏమిటన్నది కాదు విషయం. నువ్వు పెద్దింటి కోడలివి. అర్థమైందా – నీ స్నేహితురాలైనా నిన్ను ఇలాగే చూడాలనుకుంటుంది...."

మామగారి మాటల్లో అన్నీ తెలిసినట్లున్న మందలింపు.... "కాదు" అనలేదుగా.... కళ్ళనీళ్ళు తిరిగాయి భాగ్యవతికి.

భాగ్యవంతురాలైన తన స్నేహితురాలిని పేరు పేరున తన వాళ్ళకు గర్వంగా పరిచయం చేసింది రాజీ. అక్కడ ఒక్కొక్క ఆడపిల్ల బంగారపు షోకేసులో బొమ్మలా ఉన్నది. పెద్దవాళ్ళు సరేసరి. కాసుల పేర్లతో కంఠాలు వంగిపోతున్నాయి.

వీడియోలు, ఫోటోలు, హడావిడి....

అందగత్తె భాగ్యవతి లైట్లు పడినప్పుడల్లా మెరిసిపోతోంది. కానీ, ఆమె కళ్ళల్లో కాంతి ఆ కృత్రిమ జిలుగుకు పాలిపోతోంది.

పాత స్నేహితురాళ్ళు ఒకపక్కన ఉన్నారు. "హల్లో!" అన్నది కానీ, వాళ్ళ దగ్గరకు వెళ్ళనీయలేదు రాజీ బంధువులు.

"ఎలక్ట్రీషియన్ ఏడీ?.... అక్కడ ఏదో సర్క్యూట్ ఫెయిల్ అయిందట...." ఎవరో హడావిడిగా వచ్చారు.

"ఇక్కడే ఉన్నాను.... వస్తున్నాను...." కదిలాడు ఆ వ్యక్తి. అంతవరకు దగ్గర ఉన్న స్తంభానికి ఆనుకుని, ఈ ఫార్సంతా చూస్తున్నాడు కాబోలు.

"అరె.... అతను రాజేశ్వరరావు కదూ!" గభాలున అన్నది భాగ్యవతి.

"ఆఁ! గుర్తుపట్టావే – అతనే – ఎలక్ట్రిక్ డిపార్ట్‌మెంటులో పని చేస్తున్నాడు...."

"అరే....! మరి నన్ను పలకరించలేదేం?... అదేమిటి రాజీ! నువ్వన్నా గుర్తు చేసి ఉండచ్చు కదే...."

"ఒద్దులేవే....నీ స్టేటస్ ఏమిటి? అతనెక్కడ? అతను గుర్తుపట్టకేం.... 'భాగ్య వస్తుందా?' అని అడిగాడు."

అవాక్కై చూస్తోంది భాగ్య.... కాలేజీ రోజుల్లో పెద్ద హీరో అతను.... ఇప్పుడు చిన్న ఉద్యోగి.... అయితేనేం అతను మనిషి కాదా?!

గొప్పగా డిన్నర్ జరుగుతోంది.... మంది మాట్లాడుకుంటున్నారు. "నువ్వెలాగూ అక్కడ ఏం తినలేవని నాకు తెలుసులే.... ఇంద...." కూల్‌డ్రింక్ ఇస్తూ అన్నది రాజీ....

అంత పెద్ద విందులో తను అన్నం తినకూడదని రాజీ, ఆమె బంధువులు – వాళ్ళే నిర్ణయించేసుకున్నారు.

ఆకలి మండిపోతోంది భాగ్యకు. డైటింగ్ కొంత, మొనాటనీ కొంత.... సరిగ్గా ఇంట్లో తినే భాగ్యంలేని భాగ్య.... కానీ, ఇక్కడ తన స్నేహితుల మధ్య హాయిగా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చెయ్యాలని ఉన్నది.... కానీ....

మాట్లాడకుండా కూల్‌డ్రింక్ తాగింది. భాగ్య బాధపడుతోంది.... రాజీని ఎట్టకేలకు వదిలించుకుని కారులో కూర్చుంది. బోలెడంత మంది కారు దగ్గరకు వచ్చి వీడ్కోలు చెప్పారు.

అది కడుపులో మంటో, నిరాశో, ఆకలో – ఏదో అర్థం కానట్లు తలకాయ వెనక సీటుకు ఆన్చి పడుకున్నది భాగ్య. జోరున వర్షం.... దుఃఖంలా....

గేటుకు అవతల చీకట్లో కారు సడ్డున ఆగింది. ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది.

చేతుల్లో ఏవో పాకెట్లతో రాజేశ్వరరావు....

"మీరు...." గబాలున అద్దం దించుతూ అన్నది.

"అంత మన్నించి నన్ను పరాయివాడని చేసెయ్యకు... ఇదిగో, నువ్వు తిన్నావా? అని కూడా అడిగేవారు లేరు. నీకు ఇష్టం కదా పులిహోర, గారెలు... ఎలా ఉన్నావు?"

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పడం ఎంత కష్టం?!

మౌనంగా పేపరు ప్లేట్లు తీసుకున్నది.... పిక్నిక్, వనభోజనాల్లో పులిహోర కోసం చంటిపిల్లలా అల్లరి చేసేది భాగ్య ఒకప్పుడు.

కారులో అలముకున్న చీకట్లో తెల్ల ప్లేటులో మెరుస్తున్నాయి పసుపు అన్నంలో నల్లటి ఆవాలు....

"ఇంక వెళ్ళనా? ఎలా ఉన్నావో చెప్పద్దు కానీ, ఇలా.... ఇలా మాత్రం అయిపోకు...."

"ఎలా?" అన్నది అప్రయత్నంగా.

"కరగలేని మైనపు బొమ్మలా – వెలగని కొవ్వొత్తిలా..." తల వంచుకున్నది భాగ్య.... ఏదో దుఃఖం అది ఏ తరహాదో తెలియలేదామెకు. కొన్ని అభిమానాలకూ, మమతలకు నిర్వచనాలుండవు – రాజు అభిమానం అలాంటిదే.

దరిద్రమంటే విసుగూ, భయమూ రాజూ అనే --వి. కానీ, దరిద్రం కంటే భయంకరమైనది అనుభవంలోకి వచ్చి ఉండాలి. స్తబ్ధత....

ఉలిక్కిపడి తలెత్తి చూసింది భాగ్య.

"బయలుదేరు ఇంక...." కారు సడ్డున బయలుదేరింది.... డోర్ బలంగా వేసుకోవడంలో అతని చెయ్యి కారు డోర్ మధ్య....

"సారీ.... రాజూ.... సారీ!"

"ఫరవాలేదు. డ్రైవర్, పోనీ...." నలిగినచెయ్యి రెండో చేత్తో పట్టుకుని చీకట్లో కలసిపోయాడు రాజేశ్వరరావు.

వెనక్కు వెనక్కు తిరిగి చూసింది. వర్షపు మసకలో నీడలాంటి మనిషి.

పులిహోర నోట్లో పెట్టుకోగానే ఎందుకో పుక్కిలింతలుగా దుఃఖం వచ్చింది.

ప్రసాదంలా తింటోంది. పెట్టేవారి భావాలు ఆహారానికి ఎంత అమృతత్వాన్ని ఇస్తాయో అర్థమౌతోంది ఆమెకు.... ఆప్యాయత లేని తన ఖరీదైన డైనింగ్ టేబుల్ మీద అన్నం ఎక్కదు మరి....

చుట్టూ వర్షం. ఇప్పుడు విసుగ్గా లేదు.

అర్హత లేకపోయినా, నిశ్శబ్దపు వరాలు కొన్ని నిజంగానే మనిషి మీద వర్షిస్తాయేమో!....

ఇల్లు దగ్గరౌతుండగా కారు ఆపాడు డ్రైవర్.

"ఎందుకు?" కళ్ళు తుడుచుకుంటూ అడిగింది.

"కారు క్లీన్ చేసి, పేపర్ ప్లేట్లు పారేద్దామమ్మా.... ఇంట్లో పెద్దాళ్ళకు ఇదంతా నాన్సెన్సుగా కనబడుతుంది...."

అన్నీ అర్థమౌతున్న డ్రైవర్‌లో మనిషి. ఏదో వెలుతురు కారు మీద పడ్డట్లయింది.

ప్రవృత్తులను బట్టి వృత్తులను నిర్ణయించే ఉద్ధరింపు మనస్తత్వం దేశంలో ఎలాగూ లేదు. కానీ, వృత్తులను బట్టి ప్రవృత్తులను ఆపాదించే అసహ్యత ఎక్కడిదసలు?!

ఎలక్ట్రీషియన్‌లో స్నేహితుడు రాజేశ్వరరావు. డ్రైవర్‌లో తండ్రి లాంటి రామయ్య.

* * *

ఎదుటివారి గురించి ఎన్నాళ్ళయింది ఆలోచించి?! ఎంతసేపూ నా బాధ, నా దుఃఖం, నా మోనాటనీ, నా బంగారు పంజరం. అన్ని ఆడంబరాల ముసుగులు విప్పేసిన తరువాత ఆలోచిస్తూ పడుకున్నది భాగ్య.... భర్త రాడు....

పాత ఆటోగ్రాఫ్ బుక్ తీసింది.... ఎన్ని జ్ఞాపకాలు?!

ఒకచోట "ది బెస్ట్ ఆపర్చునిటీ లైఫ్ గివ్స్ ఈజ్ ది ఇండివిడ్యువల్ ఎడ్వాన్స్‌మెంట్. – రాజేశ్వర్..."

ఏమన్నాడు రాజేశ్వరరావు? "స్తబ్ధత...." ఎంత నిజం? ఎంత భయంకరమైనది అది?!

'ఎలా ఉన్నదో అతని చెయ్యి?...'

ఏదో ఆలోచనల సజీవత అగ్గిలా ఆమెలో ఘనీభవించిన మంచుతెరల్ని కరిగిస్తోంది....

పొద్దున్నే....

"అమ్మగారూ, ఫోను...."

"నేను రాజేశ్వరరావును.... నా చెయ్యి బాగానే ఉన్నది.... ఏదో అయిపోయిందని రాత్రంతా నిద్రపోయి ఉండవు.... అందుకే ఫోను చేశాను...."

అవాక్కైపోయింది ఆమె.

"ఎందుకలా స్తబ్ధుగా.... నువ్వు బోలెడు చెయ్యగలవు తెలుసా? ఆలోచించు. ఉంటాను...." ఫోను పెట్టేసిన శబ్దం.

"ఎవరమ్మాయ్?" మామగారి ఎంక్వైరీ.

ఏం చెప్పాలి?

"మా బంధులెవరో:...." స్నేహం కన్నా బంధువు పదంలో కొంత రక్షణ. దేన్నించి రక్షణ?!

ఫోను, కారు, బంగళా, ఆస్తి, నగలు, ఇవన్నీ పేరుకే తనవి.... సొంతం కానివి.... ఏం తాకట్టుపెట్టుకుంటే ఈ గౌరవం, సొంతం అనుకునే భ్రాంతి.... స్వాతంత్ర్యాన్నా? ఎందుకు అది పోగొట్టుకోవడానికి ఇన్ని ప్రయత్నాలు? ఇన్ని బంధనాలు?!

ఏమన్నాడు రాజేశ్వరరావు?! వెలగని కొవ్వొత్తిలా.... ఏమిటీ వెలిగించేది?! ఏమిటది?!

"నేను మనిషిని" అన్న పలవరింపు.... ఎదుటి వ్యక్తులలో వ్యక్తిత్వపు గుర్తింపు....

మైనపు బొమ్మకు ఆలోచన అనే అగ్గి సోకి, వెలుతురు బొమ్మగా మారుతోంది మెల్లిగా.... అతిమెల్లిగా....

('ఇండియా టుడే' ఫిబ్రవరి 21-5 మార్చి, 1994)